
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
మంగళవారం 13 ఫిబ్రవరి 2024





కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు అవిశ్వాస తీర్మాన నోటీసును అందజేస్తున్న మానుకోట మునిసిపల్ కౌన్సిలర్లు

నేడు మేడిగడ్డకు సీఎం

- బ్యారేజీ వద్ద ముమ్మరంగా ఏర్పాట్లు
- పార్కింగ్ ప్రదేశాలతోపాటు సభాస్థలి నిర్మాణం
- గోదావరిలో కుంగిన పిల్లరు వద్ద డీవాటరింగ్

మహదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 12 : భూపాల పల్లి జిల్లా మహదేవపూర్‌లోని మేడిగడ్డకు ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం వస్తున్నారు. మంత్రివర్గ సభ్యులు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మె ల్సీలతో కలిసి మేడిగడ్డ బ్యారేజీని సందర్శించను న్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవ కలు చోటుచేసుకున్నాయనే ఆరోపణల నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిశీలనకు ఈ బృందం రానుంది. ఈ పర్యటనపై సీఎం ఇప్పటికే అసెంబ్లీలో ప్రకటించారు. రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సుమారు 40 బస్సుల్లో మేడిగడ్డకు రానున్నారు. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. మేడిగడ్డ బ్యారేజీ సందర్శన అనంతరం సమీపంలోని హోమశాల వద్ద పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. బ్యారేజీ నిర్మాణ లోపాలను వివరించనున్నారు. ఈ సందర్భంగా జరిగే సభలో ముఖ్యమంత్రి ప్రసంగించనున్నారు.

ఇందుకు అధికారులు వేదికను ఏర్పాటు చేస్తున్నారు. వీవీపీ పార్కింగ్, విడిది ప్రదేశా లను ఇప్పటికే సిద్ధం చేశారు. అలాగే బ్యారేజీ వంతెనపై కుంగిన పిల్లరు మీదుగా మహా రాష్ట్ర వైపు నుంచి గోదావరి నదిలో పగుళ్లు తేలిన పిల్లర్ల వద్దకు రేవంత్‌రెడ్డి బృందం వెళ్ల నుండగా అక్కడ సైతం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా బ్లాక్-7లోని 20వ పిల్లరును ముఖ్య మంత్రి పరిశీలించే అవకాశం ఉండ టంతో ఆ ప్రదేశంలో ఊటల ద్వారా వస్తున్న నీటిని డీవాటరింగ్ చేస్తున్నారు. కుంగిన ప్రాంతంలో కాంక్రీటు పగుళ్లు తేలడంతో గోదావరి ప్రవాహాన్ని మరల్చేందుకు ఏర్పాటు చేసిన మట్టి కట్టల ద్వారా ఊటలు ఉబికి వస్తున్నాయి. దీంతో పెద్ద మోటార్లను ఏర్పాటు చేసి నీటిని తొలగిస్తున్నారు. అంతేకా కుండా ముఖ్యమంత్రి వచ్చే మార్గాల్లో సైతం స్వల్ప మార్పులు చేశారు. బొమ్మాపూర్, ఎల్కేశ్వరం, సూరారం మీదుగా మేడిగడ్డకు ముఖ్యమంత్రి బృందం చేరుకుంటుందని రూట్‌మ్యాప్ సిద్ధం చేయగా సోమ వారం దానిని మార్చేశారు. కుదురుపల్లి వద్ద నుంచి మహదేవపూర్ మండల కేంద్రం, ఎల్‌అండ్‌టీ రోడ్డు మీదుగా నేరుగా మేడిగడ్డ బ్యారేజీకి ముఖ్యమంత్రి, మంత్రివర్గ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చేరుకోనున్నారు. తిరిగి అదే మార్గంలో హైదరాబాద్‌కు వెళ్లిపోనున్నారు. మహదేవపూర్ నుంచి వెళ్లే మార్గంలో సుమారు ఐదు గ్రామాలు ఉండటంతో ట్రాఫిక్ పరంగా ఇబ్బందులు తలెత్తుతాయనే ఉద్దేశంతో రూట్‌ను మార్చినట్లు సమాచారం.





బ్యారేజీ 20వ పిల్లరు వద్ద ఊటల ద్వారా వస్తున్న నీటిని డీవాటరింగ్ కోసం ఎత్తిపోస్తున్న మోటార్లు

బస్సులో వచ్చి.. హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు..

హైదరాబాద్ నుంచి ఏసీ బస్సుల్లో ఉదయం 9.30 గంటలకు బయల్దేరనున్న ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మధ్యాహ్నం 2 గంటలకు మేడిగడ్డకు చేరుకోన్నారు. బ్యారేజీ వద్ద పరిశీలన, సభ అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు తిరిగి హైదరాబాద్‌కు బస్సుల్లో బయల్దేరనున్నారు. ముఖ్యమంత్రి మాత్రం మేడిగడ్డ నుంచి హెలిక్యాప్టర్ ద్వారా హైదరాబాద్‌కు తిరిగి వెళ్లనున్నారు.

పర్యటన ఇలా..

- ఉదయం 9.30గంటలకు రోడ్డు మార్గాన హైదరాబాద్ నుంచి మేడిగడ్డకు బయల్దేరుతారు.
- మధ్యాహ్నం 2 గంటలకు మేడి గడ్డ బ్యారేజీకి చేరుకుంటారు.
- 2 నుంచి 3 గంటల వరకు బ్యారేజీ వంతెన, కుంగిన పిల్ల ర్లను పరిశీలించనున్నారు.
- మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నీటిపారుదల శాఖ అధికారు లతో సమావేశమై సమీక్షించనున్నారు.
- సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు మేడి గడ్డ బ్యారేజీ పరిస్థితి, గత ప్రభుత్వ వైఫల్యాల గురించి మీడియాతో సీఎం మాట్లాడతారు.
- సాయంత్రం 5 గంటలకు తిరిగి హైదరాబా ద్‌కు వెళ్తారు.



మేడిగడ్డ బ్యారేజీ వద్ద సభావేదిక నిర్మాణం కోసం కొనసాగుతున్న పనులు

బీఆర్ఎస్ వైస్ చైర్మన్‌కు షాక్

- మానుకోట మునిసిపల్ వైస్ చైర్మన్‌పై బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఎం సంతకాలు
- కలెక్టర్‌కు తీర్మాన నోటీసును అందించిన కౌన్సిలర్లు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 12: మహబూబాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ వైస్ చైర్మన్‌కు షాక్ తగిలింది. జిల్లా కేంద్రంలోని మానుకోట మునిసిపాలిటీ బీఆర్ఎస్ వైస్ చైర్మన్ ఎండీ.ఫరీద్‌పై కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టారు. మునిసిపాలిటీలో 36 మంది కౌన్సిలర్లు ఉన్నారు. 2020 జనవరిలో జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మెజారిటీ స్థానాలు రాగా చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు ఆ పార్టీకి చెందిన వార్డు కౌన్సిలర్లు కైవసం చేసుకున్నారు. వైస్ చైర్మన్ ఎండీ.ఫరీద్‌పై గత కొంతకాలంగా అవిశ్వాస తీర్మానానికి కౌన్సిలర్లు మొగ్గు చూపుతూ.. వచ్చారు. మెజారిటీ కౌన్సిలర్లు ఒప్పుకోవడంతో తాజాగా సోమవారం అతనిపై అవిశ్వాసం పెడుతూ.. 29 మంది సంతకాలు చేసిన ప్రతిని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు అందజేశారు.

ఆరుగురు మినహా.. 29 మంది సంతకాలు

మహబూబాబాద్ మునిసిపాలిటీలో 36 మంది సభ్యులు ఉండగా అందులో ఒక వార్డు కౌన్సిలర్ మృతి చెందారు. మిగిలిన 35 మందిలో బీఆర్ఎస్ ప్రాతినిధ్య 22 మంది కౌన్సిలర్లు ఉండగా, కాంగ్రెస్ నుంచి 9 మంది, సీపీఐ నుంచి ఇద్దరు, సీపీఎం నుంచి ఇద్దరు కౌన్సిల్‌లో ఉన్నారు. కాగా, సీపీఐ ఇద్దరు కౌన్సిలర్లు, బీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు, కాంగ్రెస్‌కు చెందిన వార్డు కౌన్సిలర్ వెరసి ఆరుగురు మినహా మిగతా 29 మంది అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేశారు. సంతకాలు చేసిన వారిలో బీఆర్ఎస్‌కు చెందిన 19 మంది, కాంగ్రెస్‌కు చెందిన 8 మంది, సీపీఎంకు చెందిన ఇద్దరు కౌన్సిలర్లు ఉన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, సీపీఎం, కాంగ్రెస్ కౌన్సిలర్లు మార్నేని వెంకన్న, ఎడ్ల వేణు, సూర్నపు సోమయ్య, దండెబోయిన బుజ్జివెంకన్న మాట్లాడుతూ.. మునిసిపల్ వైస్ చైర్మన్ ఎండీ.ఫరీద్ కౌన్సిలర్లను సమన్వయం చేయడం, విధుల నిర్వహణలో విఫలమయ్యారని, రాజకీయాలకు అతీతంగా మూడు పార్టీలు కలిసి అవిశ్వాసానికి ముందుకు వచ్చామని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సలీమ్, పద్మ, సుజాత, సునిత, హరిసింగ్, శ్రీను, విజయలక్ష్మి, స్వాతి, శ్రీదేవి, ఫరీద, సరస్వతి, జోత్స్న, జగన్, అర్షిక, కోఆప్షన్ సభ్యులు నిమ్మల శ్రీను పాల్గొన్నారు.

అమాయక ప్రాణాలకు 'ఉచ్చు'

- వన్యప్రాణుల కోసం తీగలు అమర్చిన వేటగాళ్లు
- విద్యుత్ ఉచ్చుకు వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు బలి
- భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో విషాదం



రమేష్, ప్రదీప్ (ఫైల్)

వివరాలు 7లో..

భారీగా పంచాయతీరాజ్ అధికారుల బదిలీలు

- సీఈవో, డిప్యూటీ సీఈవోలు, డీపీవోలకు స్థానచలనం
- ఉమ్మడి జిల్లాలో 23 మంది ఇతర ప్రాంతాలకు..

7లో..

నేటి నుంచి ప్యాసింజర్ రైళ్ల పునరుద్ధరణ

డోర్నకల్, ఫిబ్రవరి 12 : రోలింగ్ కారిడార్ బ్లాక్ వల్ల గతంలో రైల్వే అధికారులు రద్దు చేసిన కాజీపేట-డోర్నకల్-విజయవాడ, విజయవాడ-డోర్నకల్-కాజీపేట మధ్య నడిచే పుష్‌పుల్ ప్యాసింజర్ రైలు, విజయవాడ-డోర్నకల్-భద్రాచలం రోడ్, భద్రాచలం రోడ్-డోర్నకల్-విజయవాడ స్టేషన్ల మధ్య నడిచే ప్యాసింజర్ రైళ్లను మంగళవారం నుంచి పునరుద్ధరిస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. పునరుద్ధరించిన రెండు ప్యాసింజర్ రైళ్లు ఈ నెల 25వ తేదీ వరకు నడుస్తాయని తెలిపింది. సామాన్య ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తుల దృష్ట్యా రైల్వే ఉన్నతాధికారులు ప్యాసింజర్ రైళ్ల పునరుద్ధరణకు నిర్ణయం తీసుకోవడం పట్ల డీఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు మైనూపాషా హర్షం వ్యక్తం చేశారు.

జిల్లా అడిషనల్ ఏఆర్ ఎస్పీగా కుమారస్వామి



మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 12: మహబూబాబాద్ జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు అడిషనల్ ఏఆర్ ఎస్పీగా సీహెచ్.కుమారస్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జీ పాటిల్‌ను కలిసి మొక్క అందించారు. కుమారస్వామి గతంలో కొత్తగూడెం, నారాయణపేట, ములుగు, ఖమ్మం జిల్లా పోలీసు కార్యాలయాల్లో విధులు నిర్వహించినట్లు చెప్పారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 12 : నిరుద్యోగ యువతీ, యువకులు ఉపాధి అవకాశాల కోసం ఏర్పాటు చేస్తున్న శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ రామకృష్ణ అన్నారు. మహబూబాబాద్‌లోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం సంకల్ప్ పథకం అమలులో భాగంగా జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసు, దైవకృప వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. ఇలాంటి శిక్షణలు ఉపాధి కోసం ఎంతగానో తోడ్పడుతాయని చెప్పారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న మహిళలకు బ్యాగులు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నజీర్, సిద్ది కోటేష్, షేక్ సైజాన్, బానోత్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా మిర్చి రాబడులు

- కేసముద్రం మార్కెట్‌కు 7.964 బస్తాల రాక
- ఈ-వేలానికి అదనపు సమయం
- మిర్చి మార్కెట్‌కు రెండు రోజులు సెలవు



కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన మిర్చి బస్తాలు

కేసముద్రం, ఫిబ్రవరి 12: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం భారీగా మిర్చి రాబడులు కొనసాగాయి. ఈ మిర్చి సీజన్‌లోనే అత్యధికంగా 669 మంది రైతులు 7,964 బస్తాల్లో 2,922 క్వింటాళ్ల మిర్చిని విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకు వచ్చారు. ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్(ఈ-నామ్) విధానంలోని ఈ-వేలం ద్వారా తేజ రకం మిర్చి క్వింటాకు గరిష్ఠంగా రూ.21,809, కనిష్ఠంగా రూ.10,000, నగటున రూ.20,200, తాలు మిర్చి క్వింటాకు గరిష్ఠంగా రూ.14,256, కనిష్ఠంగా రూ.8000, నగటున రూ.11,300 చొప్పున ధరలతో వ్యాపారులు ఖరీదు చేశారు. మార్కెట్‌లో గత నెల 30 నుంచి నిత్యం 1500 నుంచి 2వేల బస్తాల వరకే రాబడులు ఉన్నాయి. మూడు రోజుల సెలవుల అనంతరం ప్రారంభమైన మార్కెట్‌కు ఒక్కసారిగా సుమారు 8వేల బస్తాల మిర్చి పోటెత్తింది.

ఈ-వేలానికి అదనపు సమయం

మార్కెట్‌కు మిర్చి అంచనాలకు మించి రావడంతో వ్యాపారులు యార్డులోని సరుకు అంతటినీ పరిశీలించి ఈ-నామ్ విధానంలోని ఈ-వేలంలో ధరలు నమోదు చేసేందుకు అదనపు సమయాన్ని మార్కెట్ అధికారులు కేటాయించారు. సరుకు దక్కించుకున్న వ్యాపారులు, ధరలకు సంబంధించిన 'విన్నర్ లిస్ట్' ఒంటిగంటకు విడుదల కావాల్సి ఉండగా సాయంత్రం 5 గంటలకు వెలువడింది. రాత్రి వరకు తక్కువ బస్తాలు తీసుకువచ్చిన రైతుల మిర్చిని కాంటాలు పెట్టించి, మిగిలిన సరుకుకు మరుసటి రోజు కాంటాలు నిర్వహిస్తామని మార్కెట్ ప్రత్యేక హోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు తెలిపారు. సరుకు అధికంగా వచ్చినందున ఈ నెల 13, 14 తేదీల్లో వ్యాపారుల విజ్ఞప్తి మేరకు మిర్చి మార్కెట్‌ను బంద్ చేస్తున్నామని, తిరిగి ఈ నెల 15న మిర్చి కొనుగోళ్లు యథావిధిగా ప్రారంభిస్తామని వెల్లడించారు.

మానుకోట ఎక్సైజ్ శాఖలో భారీగా బదిలీలు

నెహ్రూసెంటర్, ఫిబ్రవరి 12 : మహబూబాబాద్ జిల్లా ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న సీఐలు, ఎస్సైలను బదిలీలు చేస్తూ తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్ ఇ.శ్రీధర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబాబాద్‌లో డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ సీఐగా పనిచేస్తున్న బీ.కృష్ణ ఖమ్మంకు బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో వరంగల్ అర్బన్ డీటీఎఫ్ సీఐగా పనిచేస్తున్న సీహెచ్.నీరజను కేటాయించారు. ఎస్సైలుగా విధులు నిర్వహిస్తున్న బీ.కృష్ణమూర్తి హనుమకొండకు బదిలీపై వెళ్లగా, ఆ స్థానంలో నిర్మల్ జిల్లాలో పని చేస్తున్న ఆర్.రవికుమార్‌ను కేటాయించారు. ఎస్సై హన్మంతరావు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు బదిలీ కాగా, ఆయన స్థానంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న అశోక్‌కుమార్‌ను కేటాయించారు. నర్సంపేటలో పనిచేస్తున్న రాజేశ్వరిని గూడూరు ఎక్సైజ్ ఎస్సైగా కేటాయించారు. ఖిలా వరంగల్‌లో పనిచేస్తున్న రేష్మాసుల్తానాను తొర్రూరు ఎక్సైజ్ శాఖ ఎస్సైగా కేటాయించారు.

గ్రీవెన్స్ ఫిర్యాదులను పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

మహబూబాబాద్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అధికారులు సూచించారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల వద్ద నుంచి 114 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో మాట్లాడుతూ... గ్రీవెన్స్‌లో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అలస్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలన్నారు. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా పరిష్కార మార్గం చూపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో రమాదేవి, సీపీవో సుబ్బారావు, జిల్లా అధికారులు ఖుర్షీద్, వరలక్ష్మి, సునిత, లక్ష్మీనారాయణ, మునిసిపల్ కమిషనర్ ప్రసన్నారాణి పాల్గొన్నారు.

మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు




- 18 నుంచి 25వ తేదీ వరకు నడిపేందుకు సిద్ధం
- మానుకోట, గూడూరు నుంచి 150 సర్వీసులు
- తొర్రూరు, వర్ధన్నపేట నుంచి 186..



మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 12 : ప్రతీ రెండేళ్లకొకసారి పెద్ద ఎత్తున జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతర కోసం ప్రత్యేకంగా బస్సులను నడిపించేందుకు ఆర్టీసీ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటికే వన జాతర మేడారంకు సెలవు రోజుల్లో భక్తులు వెళ్లి వస్తుండడంతో మానుకోట జిల్లా కేంద్రం నుంచి బస్సులను నడిపిస్తున్నారు. ప్రతీ ఆదివారం రోజు ఇక్కడి నుంచి భక్తులు మేడారానికి తరలివెళ్లి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకుంటున్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు మహాజాతర జరుగనుంది. 21న సారలమ్మ దేవత, 22న సమ్మక్క దేవత గద్దెలపైకి రానున్నారు. 23న సమ్మక్క, సారలమ్మ దేవతలు గద్దెలపై కొలువుదీరుతారు. భక్తుల మొక్కుల చెల్లింపు, పూజల అనంతరం 24న దేవతల వన ప్రవేశం ఉంటుంది. ఈ నాలుగు రోజుల మహోత్సవ ఘట్టం చూసేందుకు జిల్లాలోని పల్లెల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివెళ్లే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్లుగా బస్సులను నడిపించేందుకు ఆర్టీసీ అధికారులు ప్రణాళికలు రచించారు.

జిల్లాలోని మహబూబాబాద్, గూడూరు, తొర్రూరు, వరంగల్ జిల్లా వర్ధన్నపేట నుంచి ఆర్టీసీ బస్సులను నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మహబూబాబాద్, తొర్రూరు బస్టాండ్‌ల ప్రాంగణంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 18 నుంచి 25వరకు వారం రోజుల పాటు నిరంతరాయంగా భక్తులను మేడారానికి తరలించి మొక్కులు చెల్లించుకున్నాక తిరిగి వారి గమ్యస్థానాలకు చేర్చే విధంగా బస్సులను సిద్ధం చేశారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం దృష్టిలో పెట్టుకుని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గత జాతర కంటే ఈ సంవత్సరం బస్సుల సంఖ్యను పెంచారు.



మహబూబాబాద్ బస్టాండ్‌లో మేడారం ప్రయాణికులు టిక్కెట్ తీసుకునేందుకు ఏర్పాటు చేసిన క్యూలైన్‌లు, టిక్కెట్ కౌంటర్లు

మానుకోట నుంచి 150 బస్సులు..

మహబూబాబాద్ జిల్లా కేంద్రం నుంచి మేడారం వన జాతరకు 150బస్సులను నడిపేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక డిపోకు చెందిన 30 బస్సులతో పాటు ఇతర డిపోల నుంచి 120బస్సులను సమీకరించి ఈనెల 18 నుంచి మేడారానికి నడుపనున్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం నుంచి 140 బస్సులు, ఇదే జిల్లాలోని గూడూరు మండల కేంద్రం నుంచి 10 బస్సు లను నడుపనున్నట్లు అధికారులు తెలిపారు. మహ బూబాబాద్ నుంచి మేడారంకు పెద్దలకు రూ.350, పిల్లలకు రూ.200, గూడూరు నుంచి మేడారంకు పెద్దలకు రూ.280, పిల్లలకు రూ.160 చార్జీని నిర్ణ యించారు. మహబూబాబాద్ నుంచి బయలుదే రిన బస్సులు గూడూరు, నర్సంపేట, మల్లంపల్లి, ములుగు, పస్రా మీదుగా మేడారం చేరుకుంటా యి. ఇక మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేకంగా రెండు టిక్కెట్ కౌంటర్లను సిద్ధం చేశారు. ఎండ వేడిమి తగలకుండా షామియానాలు వేయనున్నారు. తాగునీటి సౌకర్యం కల్పించనున్నారు. ఇక బస్టాండ్ సమీపంలో తాత్కాలిక మరుగుదొడ్లను సిద్ధం చేశారు. ఎల్లప్పుడు అందుబాటులో ఉండి భక్తులకు సేవలందించేందుకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించారు.

తొర్రూరు నుంచి 186 బస్సులు..

జిల్లాలోని తొర్రూరు డిపో నుంచి మేడారం జాతరకు 186 బస్సులను నడిపేందుకు ఆర్టీసీ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అందులో తొర్రూరు డివిజన్ కేంద్రం నుంచి 156 బస్సులు, వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండల కేంద్రం నుంచి 30 బస్సులు నడిపేందుకు ప్రణాళికలు రచించారు. తొర్రూరు నుంచి మేడారంకు పెద్దలకు రూ.350, పిల్లలకు రూ.200, వర్ధన్నపేట నుంచి పెద్దలకు రూ.300, పిల్లలకు రూ.160 టిక్కెట్ ధరను నిర్ణయించారు. తొర్రూరులో బయలుదేరిన బస్సులు వర్ధన్నపేట, వరంగల్, ములుగు, పస్రా మీదుగా మేడారం చేరుకుంటాయి. తొర్రూరు బస్టాండ్ ప్రాంగణంలో భక్తులు టిక్కెట్లు తీసుకునేందుకు ప్రత్యేకంగా కౌంటర్లను ఏర్పాటు చేశారు. అక్కడ ఎండ వేడిమి తగలకుండా షామియానాలు ఏర్పాటు చేయనున్నారు. భక్తుల కోసం తాగునీటి సౌకర్యంతో పాటు మజ్జిగ ప్యాకెట్లను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు

శివప్రసాద్, ఆర్టీసీ డిపో మేనేజర్, మానుకోట



మేడారం మహాజాతరకు వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ నెల 18 నుంచి 25 వరకు భక్తుల సౌకర్యార్థం మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు గూడూరు మండల కేంద్రం నుంచి నుంచి 150 బస్సులను నడిపిస్తాం. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో టిక్కెట్ కౌంటర్లు ఏర్పాటు చేశాం. భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు ఎండ వేడిమి తగలకుండా షామియానాలు ఏర్పాటు చేస్తాం. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సంస్థ అభ్యున్నతికి సహకరించాలి.

పద్మాక్షికాలనీలో ఒకరిపై దాడి

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 12: హనుమకొండ పోలీసు స్టేషన్ పరిధి పద్మాక్షికాలనీలో ఒకరిపై దాడి చేసిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పద్మాక్షి కాలనీకి చెందిన బొంత వెంకటేశ్వర్లు, అతడి భార్య, కొడుకు రాజుతో కలిసి నివాసం ఉంటున్నారు. వారు ఇంటి సమస్యలపై గొడవ పడుతుండగా ఇంటి పక్కనే ఉన్న రాజు, ప్రకాశ్, నాగరాజు, ఉమ, రమ, సమ్మక్క అనే ఆరుగురు వ్యక్తులు కలుగ జేసుకుని ఇంటిపైకి వచ్చారు. వెంకటేశ్వర్లు కుమారుడు రాజుపై ఆరుగురు వ్యక్తులు మూకుమ్మడిగా దాడికి దిగారు. దీనిపై వెంకటేశ్వర్లు హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

గడ్డిమందు తాగి యువకుడి ఆత్మహత్య

ఐనవోలు, ఫిబ్రవరి 12: గడ్డిమందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వెంకటాపురంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సంగెం మండలం రాంచంద్రపురం గ్రామానికి చెందిన దౌతుబాజి అజయ్(22) ఇంటర్ చదివాడు. అమ్మమ్మ గ్రామమైన వెంకటాపురంలో నివసిస్తున్నాడు. ఏదైనా పనిచేసుకోవాలని కుటుంబసభ్యులు మందలించారు. దీంతో అజయ్ వారం కిందట గడ్డి నివారణ మందు తాగాడు. కుటుంబసభ్యులు గుర్తించి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు.

మహిళా ఉద్యోగికి వేధింపులు

రూ. 8 లక్షలు కాజేసిన కారుడ్రైవర్... కేసు నమోదు చేసిన పోలీసులు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 12: వరంగల్ జిల్లా నర్సంపేట ట్రెజరీ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగిని ఆమె కారు డ్రైవర్ డబ్బులు తీసుకుని మోసం చేశాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ న్యూరాయపురలో ఉంటున్న ఓ మహిళ.. నర్సంపేట ట్రెజరీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. కుటుంబంలో విభేదాలు తలెత్తడంతో భర్తతో విడాకులు తీసుకుంది. హనుమకొండలో ఇద్దరు కుమారులతో నివాసం ఉంటోంది. కాగా, ములుగు జిల్లా బండారుపల్లి గ్రామానికి చెందిన బూజుగుండ్ల శివరాజ్ అనే వ్యక్తి రెడ్డికాలనీలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. ఈ క్రమంలో మహిళా ఉద్యోగితో ఫోన్‌లో పరిచయం చేసుకున్నాడు. తాను కారు డ్రైవర్‌గా పని చేస్తున్నానని నమ్మబలికాడు. ఈ మేరకు 2019లో మహిళా ఉద్యోగి ఒక కారు కొనుగోలు చేసి తాత్కాలిక డ్రైవర్‌గా శివరాజ్‌ను నియమించుకుంది. చాలాసార్లు ఆమె పిల్లల వద్దకు హైదరాబాద్‌కు తనతో తీసుకుని వెళ్లి వచ్చారు. ఆమె వద్దనే పర్మినెంట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆమెకు తన కుటుంబసభ్యులను సైతం పరిచయం చేశాడు.

కాగా, డబ్బులు అవసరం ఉన్నాయని మహిళ నుంచి రూ.8లక్షలు తీసుకున్నాడు. తర్వాత ఆమె సెల్‌ఫోన్ నుంచి పర్సనల్ ఫొటోలు తీసుకుని బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించాడు. డబ్బులు అడిగితే ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతానని ఫోన్ చేసి బెదిరించేవాడు. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతోపాటు కారును కూడా ఇవ్వలేదు. ఇదేమిటని అడుగగా డబ్బులు, కారు అడిగితే చంపేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో సదరు మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

'కల్యాణ' వైభోగమే..

● పూర్తయిన వేయిస్తంభాల గుడి కల్యాణ మండపం పనులు ● ఈనెల 18న ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు



వేయిస్తంభాలగుడి కల్యాణ మండపానికి తుది మెరుగులు



పూర్తయిన మండపం పైకప్పు

హనుమకొండ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని చారిత్రకంగా సుప్రసిద్ధమైన కాకతీయుల కాలం నాటి శ్రీ రుద్రేశ్వర స్వామివారి వేయిస్తంభాల గుడి కల్యాణ మండపం పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. మండపం పైకప్పు పనులు దాదాపు పూర్తికావొచ్చాయి. ఈనెల 18వ తేదీన కల్యాణ మండపం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించాలని కేంద్ర పురావస్తు శాఖ అధికారులు ముహూర్తం నిర్ణయించారు. ఈప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా హాజరుకానున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి మండప ప్రారంభోత్సవాన్ని మార్చి నెలలో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో నిర్వహించాలని మొదట నిర్ణయించారు. అయితే ఆలోగా లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉంది. దీనితో ఈ లోగానే మండపం పనులు పూర్తి చేసి ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం భావించింది. మండపం పనులను పరిశీలించేందుకు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మంగళవారం వేయిస్తంభాల గుడికి వస్తున్నారు.

పూర్తయిన పైకప్పు

కల్యాణ మండపంపైన పైకప్పు పూర్తయింది. పలకలన్నిటినీ అమర్చారు. దక్షిణ ద్వారం వైపు మూడు పలకలను అమర్చాల్సి ఉన్నది. వాటిని బుధ, గురువారాల్లో అమర్చితే మండపం పునర్నిర్మాణం పనులు పూర్తయినట్లే. మండపం పనుల త్వరితగతిన పూర్తికి స్థపతి బాలక్రిష్ణన్ శివకుమార్ నేతృత్వంలో తమిళనాడుకు చెందిన సుమారు 40మంది శిల్పులు రేయింబవళ్లు పని చేశారు. విద్యుత్‌లైట్ల వెలుగుల్లో అర్ధరాత్రి వరకు పనులు కొనసాగించారు. కేంద్ర పురావస్తుశాఖ సూపరింటెండెంట్ ఎస్. సుమితా కుమారి పర్యవేక్షణలో పురావస్తు ఇంజనీర్ క్రిష్ణచైతన్య, జిల్లా పురావస్తుశాఖ అధికారి మల్లేశం దగ్గరుండి పనులు చేయించారు. ఇంటాక్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండు రంగారావు సాంకేతిక సహాయాన్ని అందించారు.

ప్రమాదాన్ని పసిగట్టి

వేయిస్తంభాల గుడి కట్టడం చెక్కు చెదరలేదు కానీ దీనికి ఎదురుగా ఉన్న ఈ కల్యాణ మండపం మాత్రం శిథిలావస్థకు చేరుకున్నది. ఇందుకు కారణం దానికి కింది నుంచి ప్రవహించిన నీటి పాయగా గుర్తించారు. నీటి ప్రవాహం వల్ల పునాదిలో వాడిన ఇసుక తొలగిపోవడం వల్ల ఈశాన్య దిశగా రాతి స్తంభాలు కుంగి మండపం క్రమంగా పక్కకు ఒరిగి పోవడం మొదలుపెట్టింది. దీనిని అలాగే ఒదిలేస్తే మండపం ఎప్పుడైన కూలిపోయే ప్రమాదం ఉందని గుర్తించింది. ఒకవేళ అదే జరిగితే స్తంభాలన్నీ ముక్కలుగా విరిగి పోయి పునర్‌నిర్మాణం ఏమాత్రం సాధ్యం కాదు. దీంతో మండపం పడిపోక ముందే కేంద్ర పురావస్తు శాఖ 18 ఏళ్ల కిందట దీని పునర్నిర్మాణమనే మహాయజ్ఞానికి శ్రీకారం చుట్టింది. దిగితేకానీ లోతు తెలియదన్నట్లుగా పునర్నిర్మాణ పనులు చేపట్టిన తర్వాత అనేక అడ్డంకులు ఎదురయ్యాయి.

ఆగుతూ సాగుతూ..

మండపం పునర్నిర్మాణ పనులు ఇన్నాళ్లు అనేక అడ్డంకుల మధ్య ఆగుతూ సాగుతూ వచ్చాయి. మండపం పునర్మిణ పనులు 2006లో మొదలయ్యాయి. ఇంటాక్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావు చొరవతో ఒకవైపు కుంగిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్న మండపాన్ని మొదట ఎక్కడికక్కడ పూర్తిగా విప్పారు. వాటికి నెంబర్లు వేసి పద్మాక్షి గుడి సమీపంలో జాగ్రత్తగా భద్రపరిచారు. ఇసుక పునాదిని పూర్తి తొలగించి ఆ స్థానంలో మరో వెయ్యేళ్లపాటు కట్టడం నిలిచి ఉండేలా తిరిగి అదే రీతిలో ఇసుకతో (సాండ్ బాక్స్ టెక్నాలజీ) పునాదిని నిర్మించారు. బేస్‌మెంట్ పూర్తయిన తర్వాత 2010లో మండపాన్ని తిరిగి నిలబెట్టే పనులు మొదలయ్యాయి. 2017వరకు పనులు సజావుగానే సాగాయి. ఆ తర్వాత స్థపతికి బిల్లుల చెల్లింపులో జరిగిన జాప్యం వల్ల పనులు కుంటుపడ్డాయి. దాదాపు ఐదేళ్లపాటు అసలు పనులే జరగలేదు.

కేంద్రమంత్రి చొరవతో..

కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రిగా కిషన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత మండపం పనుల్లో కదలిక వచ్చింది. గతంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్నప్పుడు వరంగల్‌కు వచ్చిన పలు సందర్భాల్లో ఈ మండపం పనుల పురోగతి గురించి ఆరా తీశారు. పనులు సత్వరం పూర్తయ్యేట్లు చూస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు మండపం పనులపై ప్రత్యేక దృష్టిసారించారు. స్థపతికి చేసిన పనులకు బిల్లుల చెల్లింపుల్లో ఏర్పడిన సమస్యను ఆయన పరిష్కరించారు. బిల్లుల చెల్లింపు జరిగేట్లు చూడడమే కాకుండా చివరి దశ పనుల పూర్తికి అవసరమైన రూ.5 కోట్ల నిధులను కూడా విడుదల చేయించారు. అలాగే మండపం మిగిలిపోయిన పనులను చిన్న చిన్న బిట్లుగా చేసి ఒక్కోదానికి ఇంత అని నిర్ణయించి నిధులు విడుదల చేయడం ద్వారా పూర్తి చేసేందుకు కేంద్ర పురావస్తుశాఖ ముందుకు వచ్చింది. ఆ మేరకు ఏడాది కిందట పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి ఐదు బిట్లకు నిధులు విడుదలయ్యాయి. దీనితో పనులు వేగం పుంజుకున్నాయి. కాగా, జనవరి నెలాఖరులోగా ఎట్టి పరిస్థితుల్లో పనులు పూర్తిచేయాలని, మార్చి నాటికి ప్రారంభోత్సవానికి మండపాన్ని సిద్ధంగా ఉంచాలని కిషన్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు కేంద్ర పురావస్తుశాఖ అధికారులు రంగంలోకి దిగి పనులు త్వరిత గతిన పూర్తయ్యేలా ప్రత్యక్ష పర్యవేక్షణ జరిపారు. ఎట్టకేలకు పనులు పూర్తయి మండపం పూర్వరూపాన్ని సంతరించుకున్నది.

నేడు కిషన్‌రెడ్డి రాక

పూర్తయిన వేయిస్తంభాలగుడి కల్యాణ మండపాన్ని పరిశీలించేందుకు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి మంగళవారం వేయిస్తంభాల గుడికి వస్తున్నారు. మధ్యాహ్నం 1గంటలకు హనుమకొండ హంటర్‌రోడ్ విష్ణుప్రియ గార్డెన్స్‌కు ఎదురుగా బీజేపీ వరంగల్ పార్లమెంట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. అనంతరం ఇక్కడ మీడియాతో మాట్లాడతారు. మధ్యాహ్నం 3గంటలకు వేయిస్తంభాలగుడి కల్యాణ మండపాన్ని సందర్శించారు. పనుల పరిస్థితిని పరిశీలిస్తారు. సాయంత్రం 4 గంటలకు ఖిలా వరంగల్ కోటను సందర్శించి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తారు.

మేడారంలో కొనసాగుతున్న మొక్కులు

ముందస్తుగా దర్శించుకున్న భక్తులు

మేడారం, ఫిబ్రవరి 12 ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో వనదేవతలు సమ్మక్క, సారలమ్మలకు ముందస్తు మొక్కులు జోరుగా కొనసాగుతున్నాయి. మహాజాతరకు ముందుగానే తరలివస్తున్న భక్తులు తల్లుల గద్దెల వద్ద నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించి యాట మొక్కులు చెల్లిస్తున్నారు. సోమవారం సుమారు 50 వేల మంది వనదేవతలను దర్శించుకున్నారని దేవాదాయశాఖ ఈవో రాజేంద్రం తెలిపారు. మేడారం చేరుకున్న భక్తులు ముందుగా జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించుకున్నారు. శివసత్తు పూనకాల నడుమ వనదేవతలకు జేజేలు పలుకుతూ అమ్మవార్ల గద్దెలకు చేరుకున్నారు. తల్లులను తాకి వడిబియ్యం పోసి పసుపు కుంకుమ, పూలు, పండ్లు, చీరెలు, కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చల్లంగా చూడాలని వేడుకున్నారు.



మేడారంలో వనదేవతల గద్దెలను దర్శించుకుంటున్న భక్తులు

భక్తులకు తాగునీటి కష్టాలు

వనదేవతలకు ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి సోమవారం మేడారం తరలివచ్చిన భక్తులకు తాగుగునీటి కష్టాలు తప్పలేదు. తీవ్రఎండలో క్యూలైన్ల ద్వారా తల్లులను దర్శించుకున్న సందర్భంలో దాహంతో అల్లాడాల్సి వచ్చింది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, మహిళలు తీవ్రంగా ఇబ్బంది పడాల్సి వచ్చింది. వారి అవస్థలు చూసే వారే అక్కడ కరువయ్యారు.

వెదేక్కి చల్లబడి..

మేడారం మహాజాతర సందర్భంగా పరిసరాల్లో వెలిసిన దుకాణాల్లో శీతల పానీయాలు అమ్ముతున్నారు. వివిధ కంపెనీల కూల్‌డ్రింక్స్ లభ్యమవుతున్నాయి. అయితే.. ఆయా కంపెనీల డీలర్లు స్టాకును ఎండలోనే ఉంచుతున్నారు. రెండు మూడు రోజులపాటు ఎండలో ఉన్న కూల్‌డ్రింక్స్‌ను ఫ్రిజుల్లో చల్లబరిచి భక్తులకు విక్రయిస్తున్నారు. శీతల పానీయాలను ఎండలో ఉండటం ఆరోగ్యానికి అంతగా మంచిది కాదని నిపుణులు అంటున్నారు.



గద్దెల పరిసరాల్లో రద్దీ

గుడారాల మేడారం



మేడారం మహాజాతర సందర్భంగా ని చిరు వ్యాపారులు గుడారాలు వేసి దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 21 నుంచి నాలుగు రోజులపాటు అంగరంగ వైభవంగా జాతర జరగనుండగా మొక్కులు చెల్లించుకునేందు కోటిన్నరకు పైగా భక్తులు మేడారం తరలివస్తారని అధికారులు అంచనా వేశారు. దీంతో వ్యాపారాలు జోరందుకోనున్నాయి. అలాగే భక్తులకు ప్రభుత్వం సకల సౌకర్యాలను ఏర్పాటు చేసింది. వారికి వేలాది మంది అధికారులు సేవలు అందించనున్నారు.

లోపించిన పారిశుధ్యం



మేడారంలో పారుశుధ్యం లోపించింది. దీంతో అక్కడి పరిసరాలు దుర్వాస వెదజల్లుతున్నాయి. ఆదివారం 10 లక్షలకు పైగా భక్తులు రాగా వారి వదిలిన వ్యర్థాలను పారిశుధ్య కార్మికులు పూర్తిస్థాయిలు తొలగించలేక పోయారు. ఈ క్రమంలో సోమవారం గద్దెల పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లింది. దీనిపై భక్తులు, స్థానికులు డీపీవో వెంకయ్యకు ఫిర్యాదు చేశారు.



సద్దిమడుగులోకి ప్రవహిస్తున్న నీటిని పరిశీలిస్తున్న ఐబీ అధికారులు

మేడారానికి లక్నవరం నీటి విడుదల

సద్దిమడుగులోకి మొదలైన ప్రవాహం

రెండు రోజుల్లో జంపన్నవాగులోకి మళ్లింపు

గోవిందరావుపేట, ఫిబ్రవరి 12: మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు వచ్చే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకోసం మండలంలోని ప్రఖ్యాత లక్నవరం సరస్సు నుంచి జలాలను సోమవారం నీటిపారుదల శాఖ అధికారులు విడుదల చేశారు. ఈఈ శ్రీనివాస ఆధ్వర్యంలో సిబ్బంది తూములను ఎత్తారు. తొలుత నీటిని సమీపంలోని సద్దిమడులోకి తరలిస్తున్నారు. రెండు రోజుల తర్వాత దయ్యాలవాగు మీదుగా జంపన్నవాగులోకి ప్రవాహాన్ని మళ్లిస్తామని ఈఈ తెలిపారు. ప్రస్తుతం జంపన్న వాగులో నీటి ప్రవాహం లేకపోవడంతో భక్తులు బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ కిందనే పుణ్యస్నానాలు చేస్తున్నారు. పుణ్య జంపన్న వాగు నీటిలో తలారా స్నానం చేయడాన్ని సెంటిమెంట్‌గా భావించే భక్తులు ప్రవాహం లేకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు. మహాజాతరకు ఎనిమిది రోజుల గడువు మాత్రమే ఉండగా ఇప్పటికే నిత్యం లక్షలాది మంది వనదేవతల దర్శనానికి తరలివస్తున్నారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ ఎన్నడూ లేని విధంగా ఈసారి ఎనిమిది రోజుల ముందుగానే లక్నవరం నుంచి అధికారులు నీటిని విడుదల చేశారు.

భారీగా పంచాయతీరాజ్ అధికారుల బదిలీలు

సీఈవో, డిప్యూటీ సీఈవోలు, డీపీవోలకు స్థానచలనం

ఉమ్మడి జిల్లాలో 23మంది ఇతర ప్రాంతాలకు..

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 12: రాష్ట్రవ్యాప్తంగా జడ్పీ సీఈవో, డిప్యూటీ సీఈవో, డీపీవో, డీఆర్‌డీవోలను 105 మందిని బదిలీ చేస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఎన్నికల బదిలీల్లో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 23 అధికారులు స్థానచలనం చెందారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో భాగంగా శనివారం ఎంపీడీవోలను బదిలీ చేసిన పంచాయతీరాజ్ కమిషనర్.. సీఈవో, డిప్యూటీ సీఈవో, డీపీవో, డీఆర్‌డీవోలను బదిలీ చేశారు.

బదిలీలు ఇలా..

ఎం.విద్యాలత సీఈవో జడ్పీ భద్రాద్రి కొత్తగూడె జిల్లా నుంచి సీఈవో జడ్పీ హనుమకొండకు బదిలీపై వస్తున్నారు. ఎస్.వెంకటేశ్వర్‌రావు సీఈవో జడ్పీ హనుమకొండ నుంచి సీఈవో జడ్పీ ములుగు బదిలీ. ఎస్.ప్రసూనారాణి సీఈవో జడ్పీ ములుగు నుంచి సీఈవో జడ్పీ భద్రాద్రి కొత్తగూడెం బదిలీ. ఎ.శ్రీనివాస్‌కుమార్ డీఆర్‌డీవో హనుమకొండ నుంచి డీఆర్‌డీవో ములుగు బదిలీ. పి.నరేష్ డిప్యూటీ సీఈవో జగిత్యాల నుంచి డీఆర్‌డీవో జయశంకర్ భూపాలపల్లి బదిలీపై వస్తున్నారు. డి.పురుషోత్తం డీఆర్‌డీవో జయశంకర్ భూపాలపల్లి నుంచి డీఆర్‌డీవో మహబూబాబాద్ బదిలీ. ఆర్.సన్యాసయ్య డీఆర్‌డీవో మహబూబాబాద్ నుంచి డీఆర్‌డీవో ఖమ్మం బదిలీ. కె.నాగపద్మజ డీఆర్‌డీవో ములుగు నుంచి డీఆర్‌డీవో హనుమకొండకు బదిలీ. ఎం.సంపత్‌రావు డీఆర్‌డీవో వరంగల్ నుంచి డీఆర్‌డీవో జగిత్యాల బదిలీ. ఎస్.వసంత డిప్యూటీ సీఈవో జడ్పీ జనగామ నుంచి డిప్యూటీ సీఈవో జడ్పీ వికారాబాద్ బదిలీ. టి.పవన్‌కుమార్ డిప్యూటీ సీఈవో జడ్పీ కరీంగనర్ నుంచి డిప్యూటీ సీఈవో జడ్పీ వరంగల్ బదిలీపై వస్తున్నారు.

డి.సరిత డిప్యూటీ సీఈవో జడ్పీ మేడ్చల్ మల్కాజిగిరి నుంచి డిప్యూటీ సీఈవో జడ్పీ జనగామకు బదిలీపై వస్తున్నారు. బి.సాహితి మిత్ర డిప్యూటీ సీఈవో జడ్పీ వరంగల్ నుంచి డిప్యూటీ సీఈవో జడ్పీ జయశంకర్ భూపాలపల్లి బదిలీ. ఎస్.వెంకట్ అడిషన్ పీడీ పశుసంవర్ధక శాఖ మహబూబాబాద్ నుంచి మాతృసంస్థ వ్యవసాయ శాఖకు బదిలీ అయ్యారు. పి.బాలక్రిష్ణ అడిషినల్ డీఆర్‌డీవో ములుగు నుంచి అడిషినల్ డీఆర్‌డీవో సిద్దిపేటకు బదిలీ. జె.కౌసల్యాదేవి అడిషనల్ డీఆర్‌డీవో సిద్దిపేట నుంచి డీఆర్‌డీవో వరంగల్ బదిలీపై వస్తున్నారు. ఆర్.స్టీఫెన్‌సీల్ అడిషినల్ డీఆర్‌డీవో వికారాబాద్ నుంచి అడిషినల్ డీఆర్‌డీవో ములుగు బదిలీపై వస్తున్నారు. ఎస్.వసుమతి అడిషినల్ డీఆర్‌డీవో వరంగల్ నుంచి అడిషినల్ డీఆర్‌డీవో జయశంకర్ భూపాలపల్లి బదిలీ. లక్కినేని లక్ష్మీరమాకాంత్ డీపీవో భద్రాద్రి కొత్తగూడెం నుంచి డీపీవో హనుమకొండ బదిలీపై వస్తున్నారు. వి.జగదీశ్వర్ డీపీవో హనుమకొండ నుంచి డీపీవో ములుగు బదిలీ. లత డీపీవో జయశంకర్ భూపాల్‌పల్లి నుంచి డీపీవో పెద్దపల్లి బదిలీ. కొండ వెంకయ్య డీపీవో ములుగు నుంచి డీపీవో మేడ్చల్ మల్కాజిగిరి బదిలీ. వి.నారాయణ రావు డీపీవో జయశంకర్ భూపాలపల్లి.

భారీగా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

వరంగల్ అర్బన్ పరిధిలో 13 మందికి స్థానచలనం, పోస్టింగ్‌లు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 12: వరంగల్ అర్బన్ జిల్లాలో పని చేస్తున్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనరేట్ ఇ.శ్రీధర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొద్ది రోజుల్లో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ బదిలీలు జరుపుతున్నట్లు ఎక్సైజ్ ఉన్నతాధికారులు వెల్లడించారు. వరంగల్ అర్బన్ జిల్లాలో 3 ఎక్సైజ్ స్టేషన్లను కలుపుకుని 13 మందికి బదిలీలు, పోస్టింగ్‌లు ఇచ్చారు. అయితే ఎక్సైజ్ స్టేషన్‌లతోపాటు ఐఎంఎల్ లిక్కర్ డిపోలు, ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్ విభాగాల్లో ఎక్కువకాలం పని చేసిన వారికి బదిలీలు జరిగినట్లు ఎక్సైజ్ సిబ్బంది తెలిపారు. బదిలీ, పోస్టింగ్‌లు పొందిన వారు ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరాలని ఎక్సైజ్ కమిషనర్ ఆదేశించారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ అయిన ప్రదేశం
జి. దుర్గాభవాని	హుజురాబాద్	హనుమకొండ
ఎస్. ప్రభాకరరెడ్డి	జగిత్యాల	వరంగల్ అర్బన్
కె. రాజు	ఖమ్మం-1	ఖిలావరంగల్
సీహెచ్ఎస్.ఆనంద్‌రావు	సుల్తానాబాద్	డీటీఎఫ్ వరంగల్ అర్బన్
ఎం. తిరుమలత	కరీంనగర్ రూరల్	ఐఎంఎల్ డిపో హనుమకొండ
సీహెచ్ నాగేశ్వర్‌రావు	డీటీఎఫ్ కొత్తగూడెం	ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్
కె. నాగయ్య	అశ్వరావుపేట	ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్
సీహెచ్ నీరజ	డీటీఎఫ్ వరంగల్ అర్బన్	డీటీఎఫ్ మహబూబాబాద్
బి. చంద్రమోహన్	ఖిలావరంగల్	ఖమ్మం -2
బి. కరుణశ్రీ	ఐఎంఎల్ డిపో హనుమకొండ	డీటీఎఫ్ ఖమ్మం
టి. శ్రీనివాసులు	ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్	హుజురాబాద్
ఎం. మాధవిలత	ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్	జమ్మికుంట
ఎల్. రామకృష్ణ	హనుమకొండ	చెక్‌పోస్టు నిజామాబాద్

సీఐల బదిలీల్లో గందరగోళం

పరకాల సీఐగా వెళ్లిన అబ్బయ్య వీఆర్‌కు అటాచ్

ఇప్పటికే కేయూ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ నియామకం నిలిపివేత

హనుమకొండ, ఫిబ్రవరి 12: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ల పోస్టింగ్‌లు మూన్నాళ్ల ముచ్చటగానే మారుతోంది. పోస్టింగ్ పొందిన కొందరు అధికారులు డ్యూటీలో జాయిన్ కాకుండానే వెనక్కి పంపిస్తున్నారు. సీఐల పోస్టింగ్ నేడు పోస్టింగ్. రేపు ఊస్టింగ్. అనే పరిస్థితిలో ఉంది. ప్రధానంగా గతంలో పనిచేసిన పోలీసుస్టేషన్‌లలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులకు మాత్రమే పోస్టింగ్‌లలో ఈ మార్పు జరుగుతోందని, మిగతా వారికి ఇబ్బంది లేదని పోలీసు అధికారులు చెప్పుకొస్తున్నారు. కాగా, ఇటీవల జరిగిన బదిలీల్లో కేయూ నుంచి పరకాలకు పోస్టింగ్‌పై వెళ్లిన ఎం. అబ్బయ్యకు పోస్టింగ్ ఇచ్చినట్టే ఇచ్చి ఆర్డర్‌ను రద్దు చేశారు. విధుల్లో చేరి రెండు రోజులు గడవక ముందే సీపీకి (వీఆర్) అటాచ్ చేయడం వివాదాస్పదంగా మారింది. పరకాలకు ఇంకా ఎవరిని నియమించలేదు. అదే విధంగా ఖమ్మం నుంచి కేయూ పీఎస్‌కు పోస్టింగ్ ఇచ్చిన శ్రీధర్‌కు ఇచ్చినట్టే ఇచ్చి కొన్ని అనివార్య కారణాల వల్ల పోస్టింగ్ నిలిపి వేశారు. కేయూకు గతంలో ఏనుమాములలో పని చేసిన చేరాలును నియమించే అవకాశాలు ఉన్నాయి. అయితే పరకాలకు, కేయూకు ఒకటి, రెండు రోజుల్లో ఇన్‌స్పెక్టర్లను సీపీ నియమించనున్నారు. అలాగే ఇటీవల ములుగు నుంచి వరంగల్ కమిషనరేట్‌కు వచ్చిన మరో వివాదాస్పద ఇన్‌స్పెక్టర్‌ను కూడా వెనక్కి పంపించే అవకాశాలు మెండుగా ఉన్నాయనే పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది.

లూప్‌లైన్ లేకుండా పోస్టింగ్‌లు

ప్రస్తుతం వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఇన్‌స్పెక్టర్లుగా పోస్టింగ్‌లు పొందిన వారు లూప్‌లైన్‌లో పనిచేయకుండానే పోస్టింగ్ కొట్టేయడం కొందరు సీనియర్ అధికారులకు మింగుడుపడడం లేదు. ఒక పోలీసు అధికారి ఎస్ఐ నుంచి ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందిన తర్వాత కనీసం 3 యేళ్లపాటు లూప్‌లైన్‌లో పని చేసి ఉండాలి. కానీ ప్రజాప్రతినిధుల వద్ద సిఫారసు లేఖలు తెచ్చుకుని పోస్టింగ్‌లు తెచ్చుకుంటున్నట్టు తెలుస్తోంది.

మేడారం జాతరకు ఉత్సవ కమిటీ

● ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం ● చైర్మన్‌గా అర్రెం లచ్చుపటేల్



ములుగు, ఫిబ్రవరి 12: మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు ఉత్సవ కమిటీని ఏర్పాటుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. చైర్మన్‌గా తాడ్వాయి మండలకేంద్రానికి చెందిన అర్రెం లచ్చుపటేల్ నియమితులయ్యారు. జాతరకు ఉత్సవ కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ చైర్మన్ సహా 14మంది సభ్యులతో కూడిన జాబితాను ఇటీవల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క దేవాదాయ శాఖకు సిఫారసు చేశారు. పరిశీలించిన అధికారులు అదే జాబితాతో కమిటీని ప్రకటించారు. ఈనెల 12నుంచి 25వ తేదీ వరకు కాలపరిమితితో పని చేసే ఈ ఉత్సవ కమిటీకి చైర్మన్‌గా అర్రెం లచ్చుపటేల్ వ్యవహరించనుండగా డైరెక్టర్‌లుగా మిలుకూరి అయిలయ్య, కొండి గోపాల్, గంగెర్ల రాజారత్నం, కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, యాప అశోక్, పోరిక నారాయణసింగ్, ముంజాల భిక్షపతి, సుంచు హైమావతి, దామర్ల కిశోర్, అలం శశిధర్, వద్దిరాజు రవిచంద్ర, అంతం కృష్ణస్వామి, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు వ్యవహరించనున్నారు.

ఈ నూతన ఉత్సవ కమిటీ ఒకట్రెండు రోజుల్లో పదవీ ప్రమాణం చేసే అవకాశముంది. కాగా, తనను మేడారం జాతర ఉత్సవ కమిటీ చైర్మన్‌గా నియమించడంపై అర్రెం లచ్చుపటేల్ మంత్రులు సీతక్క, కొండా సురేఖలకు కృతజ్ఞతలు తెలిపారు. జాతరను విజయవంతం చేస్తామని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు.

అమాయక ప్రాణాలకు 'ఉచ్చు'

● విద్యుత్ ఉచ్చుకు వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు బలి ● భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో విషాదం

కాటారం/గోవిందరావుపేట, ఫిబ్రవరి 12: వన్యప్రాణులను సంహరించేందుకు వేటగాళ్ల బిగించిన విద్యుత్ ఉచ్చుకు వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు బలయ్యారు. భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేస్తుండగా విద్యుత్ ప్రసరణ జరిగే ఉచ్చు తగిలి గ్రేహౌండ్స్ జూనియర్ కమాండో బలయ్యాడు. అలాగే ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని దుంపెల్లిగూడెంలో తప్పిపోయిన గొర్రెలను వెతుకుతుండగా ఉచ్చు తగిలి ఓ వ్యక్తి మరణించాడు. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనలతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది. వివరాలు ఇలా ఉన్నాయి.

కూంబింగ్ చేస్తుండగా..



ప్రవీణ్ మృతదేహం

భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో మేడిగడ్డ బ్యారేజీని సందర్శించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రివర్గ సభ్యులు, పలువురు ఎమ్మెల్యేలు మంగళవారం పర్యటించనున్న నేపథ్యంలో కాటారం శివారు అటవీప్రాంతంలో 30 మందితో కూడిన గ్రేహౌండ్స్ బలగాలు ఆదివారం రాత్రి కూంబింగ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని రాజోలుగూడకు చెందిన 2012 బ్యాచ్ గ్రేహౌండ్స్ జూనియర్ కమాండర్ ఆడే ప్రవీణ్ (34)తో పాటు పలువురు గ్రేహౌండ్స్ కమాండోలు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో భూమికి రెండు ఫీట్ల ఎత్తులో సెంట్రింగ్ వైర్‌తో విద్యుత్ సరఫరా అయ్యేలా వన్యప్రాణుల కోసం వేటగాళ్లు తీగలను అమర్చి ఉన్నారు. అవి తగిలి ప్రవీణ్ షాక్‌కు గురై అపస్మారకస్థితికి వెళ్లారు. చేతిపై వైరు లోతుగా దిగింది. దీంతో తోటి కానిస్టేబుల్స్ తమ ఉన్నతాధికారులతోపాటు స్థానిక పోలీస్ అధికారులకు ఈ సమాచారాన్ని చేరవేశారు. స్థానిక సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్ తమ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి హుటాహుటిన బయల్దేరారు. అటవీ ప్రాంతం కాగా వాహనాలు అందుబాటులో లేకపోవడంతో అప్పటికే గ్రేహౌండ్స్ కమాండోలు ప్రవీణ్‌ను చేతులపై ఎత్తుకొని కొద్ది దూరం మోసుకొచ్చారు. అనంతరం 108 అంబులెన్స్ చేరగా అందులో తరలిస్తుండగానే ప్రవీణ్ మృతి చెందారు. మృతుడికి భార్య లత, కుమారులు హర్ష, వివాన్ ఉన్నారు. గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

గొర్రెలను వెతుకుతుండగా

ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని దుంపెల్లిగూడెం గ్రామానికి చెందిన మాదారపు అనిల్‌కు సంబంధించిన గొర్రెలు ఆదివారం రాత్రి మంద నుంచి తప్పిపోయాయి. వాటిని వెతికేందుకు తన మిత్రుడు పిండి రమేష్ (28)తో కలిసి రాత్రి 11గంటల సమయంలో సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లారు. ముందుగా నడుస్తున్న రమేష్ అటవీ జంతువులను వేటాడేందుకు గుర్తుతెలియని వ్యక్తులు అమర్చిన విద్యుత్ ఉచ్చు తగిలి షాక్‌కు గురయ్యాడు. దీంతో వెనక వస్తున్న అనిల్ అప్రమత్తమయ్యాడు. చీకటిగా ఉండటంతో కాపాడే ప్రయత్నం చేసినా అప్పటికే రమేష్ మృతిచెందాడు. అనిల్ ఇచ్చిన సమాచారంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఘటనా స్థలికి చేరుకొని విగతజీవిగా పడి ఉన్న రమేష్‌ను చూసి బోరున విలపించారు. రమేష్‌కు ఆరు నెలల కిందటే వివాహమైంది. భర్త అకాల మరణంతో ఆయన భార్య అఖిల గుండెలవిసేలా రోదించింది. మృతుడి తండ్రి సాంబయ్య ఫిర్యాదు మేరకు పస్రా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రమేష్ మృతదేహం

దుర్గామాతకు ప్రత్యేక పూజలు

తొర్రూరు రూరల్, ఫిబ్రవరి 12 : మండలంలోని కర్కాలలో నూతనంగా నిర్మించిన దుర్గామాత ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా ప్రజలు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్యానాయక్, మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, సీనియర్ నాయకులు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, సోమరాజశేఖర్, రవీందర్ రెడ్డి, అనుబంధ సంఘం నాయకులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బంగారు మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ



మూన్యా తండాలో మైసమ్మ తల్లి దేవాలయానికి శంకుస్థాపన చేస్తున్న నరేష్‌రెడ్డి

మరిపెడ రూరల్, ఫిబ్రవరి 12 : గిరిజనుల్లో భక్తి, ఆధ్యాత్మిక భావానికి నిదర్శనం బంగారు మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ అని బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నీలికుర్తి శివారు మూన్యా తండాలో బంగారు మైసమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా నరేష్ రెడ్డి మాట్లాడుతూ తండాలోని గిరిజనులందరూ ఏకమై బంగారు మైసమ్మ తల్లి దేవాలయం నిర్మించుకోవడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పానుగోతు రాంలాల్, మెంచు అశోక్‌కుమార్‌గౌడ్, గుడిపుడి శ్రీనివాసరావు, గుండగాని బాబుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

పెద్దవంగర, ఫిబ్రవరి 12 : చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, సీడీపీవో హైమావతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో లక్ష్యం సేవా సంస్థ ఆధ్వర్యంలో చిరుధాన్యాల ఆహార పదార్థాలపై రైతు వేదికలో మహిళలకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో మహిళలు పెద్ద ఎత్తున సంఘాలుగా ఏర్పడి చిరుధాన్యాల ఆహార పదార్థాలను తయారు చేసి స్టాల్స్ ఏర్పాటు చేసి విక్రయించాలన్నారు. నాబార్డ్ ద్వారా అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిరుధాన్యాలతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలన్నారు. కార్యక్రమంలో కేవీకే కోఆర్డినేటర్ మాలతి, లక్ష్యం సేవా సంస్థ సీఈవో తల్లూరి లత చైర్మన్, శంకర్, స్వరూప, పద్మ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చిన్నారుల అంత్యక్రియలు

▸ మృతుల కుటుంబాలను పరామర్శించిన నాయకులు



అమ్మాపురంలో చిన్నారుల కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి

తొర్రూరు రూరల్, ఫిబ్రవరి 12 : మండలంలోని అమ్మాపురంలో పెద్దచెరువు వద్దకు సరదాకు ఈతకు వెళ్లి ఆదివారం మృతి చెందిన చిన్నారుల అంత్యక్రియలు సోమవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన గంధం స్వామి, రూప దంపతుల పెద్దకుమారుడు గంధం యాకూబ్(14), కిన్నెర మహేష్, సావిత్రి దంపతుల కుమారుడు జంపా (12) మరో నలుగురు పిల్లలతో కలిసి గ్రామ శివారులో ఉన్న పెద్దచెరువు వద్దకు ఈతకు వెళ్లి నీటిలో మునిగి అక్కడికక్కడే మృతి చెందిన విషయం విదితమే. తొర్రూరులో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, ఎంపీపీ అంజయ్య, జడ్పీటీసీ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, సుంచు సంతోష్, కడెం యాకయ్య, జగన్, పీరారెడ్డి పలువురు చిన్నారుల తల్లిదండ్రులను పరామర్శించి ఓదార్చారు.

మోదీ ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలి

▸ వామపక్ష కార్మిక సంఘాల నాయకులు



మహబూబాబాద్‌లో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష కార్మిక సంఘాల నాయకులు

మహబూబాబాద్‌టౌన్, ఫిబ్రవరి 12: కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న మతతత్వ విధానాలను ఎండగట్టాలని వామపక్ష కార్మిక సంఘాల నాయకులు రేషపల్లి నవీన్, కుంట ఉపేందర్, కొత్తపల్లి రవి, శివారపు శ్రీధర్, హాలావత్ లింగ్యా అన్నారు. ఈ నెల 16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ మహబూబాబాద్ పట్టణంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రామిక ప్రజలపై స్వదేశీ, విదేశీ, బడా పెట్టుబడిదారులు, ఫాసిస్టు శక్తుల దాడులకు వ్యతిరేకంగా పోరాడాలని చెప్పారు. ప్రధాని మోదీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 16న జరుపతలపెట్టిన సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆకుల రాజు, ఎస్కీ.మహమూద్, సూర్యం, ఎస్కే.ముదార్, పర్వత కోటేష్, వీరన్న, వెంకన్న, రాజన్న, దేవేందర్, సాయిలు, నాగన్న, వెంకటేశ్వర్లు, రాజమౌళి, తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

● నెహ్రూసెంటర్ : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా 16న దేశ వ్యాప్తంగా నిర్వహించే సమ్మెలో జిల్లాలోని ఆశా కార్యకర్తలు పాల్గొంటున్నామని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ వల్లకొండ ఉపేంద్ర తెలిపారు. మహబూబాబాద్‌లో డీఎంహెచ్‌వో అంబరీషకు సోమవారం సమ్మె నోటీస్‌ను అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో పోతుగంటి మల్లయ్య, నిరసాని కాశేశ్వరి, కొప్పెర సుజిత, దుంప్ర నిర్మల, వెంపటి జ్యోతి, దుండి హేమలత, రసూల్, సరస్వతి, దార ఉపేంద్ర పాల్గొన్నారు.

● డోర్నకల్ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఎం, కాంగ్రెస్, ఎన్డీ నాయకులు ఉప్పనపల్లిశ్రీనివాస్, సుమీర్‌చంద్‌జైన్, యాస వెంకట నారాయణలు పిలుపునిచ్చారు. డోర్నకల్‌లో సోమవారం సార్వత్రిక సమ్మె విజయవంతం కోసం ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో సామాన్య మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో దాసరి మల్లేశం, బొమ్మన అశోక్ కుమార్, వుట్ల శ్రీనివాస్, పావనివెంకన్న, వీరభద్రం, మారు కొండయ్య, జాగర్లముడి ప్రసాద్, జేవీఆర్, పొన్నం శ్రీనివాస్, రాజేందర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● గార్ల : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక చట్టాలను పరిరక్షించాలని 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ కోరారు. సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక నెహ్రూ సెంటర్ వద్ద సంతకాల సేకరణను ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను తుంగలో తొక్కిందని విమర్శించారు. కార్యక్రమంలో కందునూరి శ్రీనివాస్, అప్పిరెడ్డి, భూక్యా హరినాయక్, జడశ్రీను, మౌలానా, వీరస్వామి, సర్వర్ పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన సీఐ సంజీవ్

తొర్రూరు, ఫిబ్రవరి 12 : తొర్రూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా టి.సంజీవ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగినబదిలీల్లో భాగంగా సీఐ వైసత్యనారాయణ మహబూబాబాద్ డీసీఆర్బీకి బదిలీ అయ్యారు. రాజన్నసిరిసిల్ల జిల్లా డీసీఆర్బీలో పని చేస్తున్న టిసంజీవ్ బదిలీపై వచ్చి తొర్రూరు సీఐగా బాధ్యతలు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి మృతి

తొర్రూరు, ఫిబ్రవరి 12 : పట్టణ కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇనుప సామగ్రిని కొనుగోలు చేసే వ్యాపారి షేక్ యాకూబ్‌అలీ (57) సోమవారం మృతి చెందినట్లు ఎస్సై కూచిపుడి జగదీష్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. దంతాలపల్లి మండలం కుమ్మరికుంటకు చెందిన యాకూబ్‌అలీ అక్కడే ఇనుప సామగ్రి వ్యాపారం చేస్తుంటాడు. ఈ మేరకు తన ద్విచక్ర వాహనం మరమ్మతులు చేసుకుని షోరూం నుంచి బయటకు రాగానే వరంగల్ నుంచి ఖమ్మం వైపు వెళ్లే లారీ ఢీకొట్టింది. దీంతో యాకూబ్ అలీ తలకు తీవ్రగాయం కాగా, ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. మృతుడి కుమారుడు యాసిన్‌పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగదీష్ తెలిపారు.

గుండెపోటుతో మార్కెట్ కార్యదర్శి మృతి

తొర్రూరు రూరల్, ఫిబ్రవరి 12 : తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి పులిగిల్ల సాలయ్య(58) గుండెపోటుతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. కేసముద్రం మండలానికి చెందిన సాలయ్య తొర్రూరు మార్కెట్ కార్యదర్శిగా 2021లో బాధ్యతలు చేపట్టి విధులు నిర్వహిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన గుండెపోటు రావడంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. వరంగల్‌లో నివాసం ఉంటున్న సాలయ్య అంత్యక్రియలు సోమవారం నిర్వహించగా మార్కెట్ పరిధిలోని సిబ్బంది హాజరై సంతాపం వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12: ములుగు జిల్లా ఏటూరునాగారంలో సూర్య షోటోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 6వ తెలంగాణ రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో మానుకోట కరాటే అకాడమీ విద్యార్థులు పతకాలు సాధించినట్లు కోచ్ వీరునాయక్ తెలిపారు. బ్లాక్ బెల్ట్ కేటగిరి బాలికల కటా విభాగంలో తేజావత్ మౌర్యప్రసన్న బంగారు పతకం, సంధ్య, దీపిక బ్రౌన్ బెల్ట్, బాలుర కటా విభాగంలో ఎల్లో బెల్ట్ విభాగంలో రేవంత్‌నాయక్ గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క చేతుల మీదుగా పతకాలు అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్, కరాటే మాస్టర్లు, తెలంగాణ పోలీసు కరాటే కోచ్ పాయం సురేష్, ఎండి.గఫూర్, గణపాక రవి, తూముల పరమేష్, తెలంగాణ షోటోకాన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పిల్లలను కిడ్నాప్ చేస్తున్నారని...

బిహార్ వాసికి దేహశుద్ధి

▸ పోలీసులకు అప్పగించిన స్థానికులు



బిహార్ వ్యక్తితో వాగ్వాదం చేస్తున్న స్థానికులు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 12: పిల్లలను కిడ్నాప్ చేసే గ్యాంగ్ తిరుగుతుందన్న సోషల్ మీడియా వదంతుల నేపథ్యంలో బిహార్ కార్మికుడు పిల్లల్ని ఎత్తుకెళ్లేందుకు వచ్చాడని అపోహతో చితకబాదారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బిహార్‌కు చెందిన వలస కార్మికుడు సీహెచ్.చందన్‌శర్మ తన భార్య బిడ్డతో కలిసి మహబూబాబాద్ శివారు అనంతారం మార్గంలో ఉన్న ఓ గార్డెన్స్‌లో సీలింగ్ వర్క్ చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం మద్యం సేవించిన మైకంలో మార్కెట్ సమీపానికి వచ్చిన అతను తన కూతురు లాగే కన్పించిన ఏడేళ్ల అమ్మాయిని చేయితో తాకాడు. కాగా, ఆ బాలికను స్కూల్ నుంచి తీసుకువెళ్లేందుకు వచ్చిన తల్లి తన బిడ్డను కిడ్నాప్ చేస్తున్నాడనే ఆందోళనతో కేకలు వేసింది. వెంటనే చుట్టూ చేరిన జనం అతన్ని పట్టుకుని నిలదీశారు. ఒకవైపు తాగిన మైకం.. మరోవైపు తెలుగు భాష రాని పరిస్థితిలో పొంతన లేకుండా మాట్లాడడంతో పాటు అతని జేబులో చిన్న కత్తి లభించడంతో చితకబాది డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు అప్పగించారు. అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించగా అసలు విషయం వెలుగు చూసింది.

అపోహలు వద్దు : ఎస్సై

మహబూబాబాద్ జిల్లాలో ఎక్కడ కూడా కిడ్నాప్ గ్యాంగ్ తిరగడం లేదని, ప్రజలు ఎవరు అపోహలను నమ్మవద్దని టౌన్ ఎస్సై పవన్ కుమార్ తెలిపారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు కనిపిస్తే దాడి చేయొద్దని, డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వారిని అదుపులోకి విచారించి కిడ్నాప్‌కు యత్నించిన వారైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించాలి



అనంతాద్రిలోని సేవాలాల్ ఆలయం వద్ద అభివాదం చేస్తున్న గిరిజన ప్రజా సంఘాల నాయకులు

నెహ్రూసెంటర్, ఫిబ్రవరి 12 : గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతిని బంజార ప్రజలు పండుగలా ఘనంగా జరుపుకోవాలని గిరిజన ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం అనంతాద్రి సమీపంలోని సేవాలాల్ ఆలయం వద్ద సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గిరిజన నేతలు మాట్లాడుతూ.. రాజకీయాలు, కుల, మత తారతమ్యాలు లేకుండా సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 14న భోగ్ భండారోతో వేడుకలు ప్రారంభమవుతాయని 15న అంగరంగ వైభవంగా గిరిజన సంప్రదాయాల నడుమ జిల్లా కేంద్రం నుంచి భారీ ప్రదర్శన ఉంటుందన్నారు. అనంతరం జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ వేడుకలకు అతిథులుగా ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, అధికారులు, వివిధ ప్రజా సంఘాల నేతలు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో బోడ లక్ష్మణ్, నూనావత్ అశోక్, గుగులోతు భీమానాయక్, రాజునాయక్, బోడ రమేష్‌నాయక్, కౌన్సిలర్ భూక్య శ్రీను, హరిలాల్, చందులాల్, నందులాల్, మోతీలాల్, రాందాస్, మంగీలాల్ పాల్గొన్నారు.

● గూడూరు : గిరిజనుల ఆరాధ్య దైవమైన శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతిని ఘనంగా నిర్వహించుకోవాలని సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు అజ్మీర కల్యాణ్ నాయక్ పిలుపునిచ్చారు. గూడూరులో సేవాలాల్ జయంతి ఉత్సవాల కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కల్యాణ్ మాట్లాడుతూ.. ఈనెల 15న సేవాలాల్ జయంతి ఉత్సవాలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ ఉత్సవాలకు రూ.10 కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బానోత్ రాంజీనాయక్, బానోత్ వెంకన్ననాయక్, దారావత్ వీరన్న, రాజు నాయక్, హనుమ, బాబునాయక్, వెంకటేష్, రాకేష్, ధనూష్ పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్లు

డోర్నకల్, ఫిబ్రవరి 12: డోర్నకల్ తహసీల్దార్‌గా కృష్ణవేణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లా టేకులపల్లి తహసీల్దార్‌గా పని చేస్తున్న కృష్ణవేణి బదిలీపై డోర్నకల్‌కు వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన నిమ్మతోట నాగభవాణి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీపై వెళ్లారు. నూతనంగాబాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ కృష్ణవేణికి కార్యాలయ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

● గూడూరు: గూడూరు తహసీల్దార్‌గా ఎం.శ్వేత బాధ్యతలు చేపట్టారు. ఖమ్మం కలెక్టరేట్‌లో డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా పనిచేసి బదిలీలో భాగంగా గూడూరు తహసీల్దార్‌గా వచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్వేతకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ కోమల, ఆర్ఐ మల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

● గార్ల : గార్ల మండల తహసీల్దార్‌గా కె.రవీందర్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన కె.స్వాతి బిందు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ కాగా, ఆమె స్థానంలో ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న రవీందర్‌ను గార్లకు బదిలీ చేయగా, బాధ్యతలు స్వీకరించారు.

● సీరోలు : సీరోలు తహసీల్దార్‌గా రాజబోయిన శారద బాధ్యతలు స్వీకరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన శారద బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ నరేష్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీపై వెళ్లిన సంగతి తెలిసిందే. తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన శారదకు ఆర్ఐ యాకూబ్‌పాషా, జూనియర్ అసిస్టెంట్ నారాయణ, ధరణి ఆపరేటర్ నర్సయ్య శుభాకాంక్షలు తెలిపారు.

● బయ్యారం : బయ్యారం తహసీల్దార్‌గా సాధియా సుల్తానా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ తహసీల్దార్‌గా పనిచేస్తున్న సాధియా సుల్తానా బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ ఇమ్మాన్యుయేల్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీపై వెళ్లిన సంగతి తెలిసిందే. తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సాధియా సుల్తానాకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి పాఠశాలల్లో ఇంటర్నల్ మార్క్స్ పరిశీలన

మహబూబాబాద్ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12: జిల్లాలోని అన్ని యాజమాన్యాలపాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ఇంటర్నల్ మార్కులను ఈ నెల 13 నుంచి 17 వరకు వెరిఫికేషన్ టీమ్స్ పరిశీలిస్తాయని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు సోమవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 30 టీంలు సందర్శించి ఇంటర్నల్ మార్కులకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తాయన్నారు. రికార్డులను ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేకాధికారులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అలాగే 24 నుంచి టెక్నికల్ కోర్సు సర్టిఫికెట్ పరీక్షలు ఉంటాయన్నారు.

రెండు క్వింటాళ్ల బెల్లం పట్టివేత

డోర్నకల్, ఫిబ్రవరి 12: డోర్నకల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మన్నెగూడెం క్రాస్‌రోడ్డు వద్ద ఆటోలో తరలిస్తున్న రెండు క్వింటాళ్ల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఉపేందర్‌రావు తెలిపారు. డోర్నకల్ ఎస్సై సంతోష్‌రావు ఆధ్వర్యంలో సోమవారం ఉదయం మన్నెగూడెం క్రాస్‌రోడ్డు వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అటు వైపుగా వచ్చిన ఆటోను తనిఖీ చేశారు. రెండు క్వింటాళ్ల నల్లబెల్లంను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రవాణాకు ఉపయోగించిన ఆటోను సీజ్ చేసి చిల్కోయలపాడుకు చెందిన ఉప్పలయ్య వెంకటరాములు బాధ్యులుగా గుర్తించినట్లు చెప్పారు. ఇందులో ఉప్పలయ్యను అదుపులోకి తీసుకోగా.. వెంకట రాములు పరారీలో ఉన్నట్లు చెప్పారు. అతన్ని త్వరలోనే అరెస్టు చేస్తామని సీఐ ఉపేందర్‌రావు పేర్కొన్నారు.

పత్తి పంటను ధ్వంసం చేసిన ఇద్దరిపై కేసు

నెల్లికుదురు, ఫిబ్రవరి 12 : పత్తి పంటను ధ్వంసం చేసిన ఇద్దరు వ్యక్తులపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. నెల్లికుదురు మండల కేంద్రానికి చెందిన కస్తూరి శ్రీనుకు మదనతుర్తి శివారులో ఎకరం భూమి ఉండగా పత్తి సాగు చేశాడు. ఈ నెల 7న దుర్గాభవాని తండా శివారు పిన్యాతండాకు చెందిన గుగులోత్ శంకర్, అతని భార్య గుగులోత్ గంగి పత్తి పంటను ధ్వంసం చేసి భూమి హద్దురాళ్లను తొలగించారు. దీంతో రూ.30వేల నష్టం జరిగిందని బాధిత రైతు కస్తూరి శ్రీను పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, గుగులోత్ శంకర్, గంగిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతి కిరణ్ పేర్కొన్నారు.

ఫర్టిలైజర్ షాపు ఇప్పిస్తానని మోసం

▸ రూ.4 లక్షలు నష్టపోయిన బాధితుడు

నెల్లికుదురు, ఫిబ్రవరి 12 : ఫర్టిలైజర్ షాపు ఇప్పిస్తానని మోసం చేసిన ఓ వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం.. మండలంలోని నైనాల గ్రామానికి చెందిన పులి శోభన్‌బాబుకు, నెల రోజుల క్రితం ఏపీలోని అనంతపురం జిల్లాకు చెందిన మాల దివాకర్ అనే వ్యక్తి ప్రధాన మంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రం నుంచి ఫోన్ చేశాడన్నారు. ఫర్టిలైజర్ షాపు పెట్టుకోవడానికి ఇఫ్కో కంపెనీ నుంచి రూ.5 లక్షలు వస్తాయని చెప్పగా, బాధితుడు పులి శోభన్‌బాబు రూ.5లక్షలు సబ్సిడీ వస్తుందని నమ్మాడు. షాపు మంజూరుకు ప్రాసెసింగ్ ఫీజు, ఇన్సూరెన్స్, ఎరువుల సరఫరాకు ఫర్టిలైజర్ కంపెనీలకు డబ్బులు చెల్లించాలని చెప్పడంతో శోభన్‌బాబు నమ్మి రూ.4 లక్షలు మాల దివాకర్ ఖాతాకు పంపించాడన్నారు. అనంతరం పలుమార్లు ఫోన్ చేసినా స్పందించక పోవడంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దివాకర్‌పై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆలిండియా యూనిటీ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

కేసముద్రం, ఫిబ్రవరి 12 : ఖమ్మంలో వచ్చే నెల 3 నుంచి 5వ తేదీ వరకు సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా, పీసీసీ సీపీఐ(ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) ఆర్ఐ పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఆలిండియా యూనిటీ మహాసభ పోస్టర్‌ను కేసముద్రంలో సోమవారం ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి మలుకూరి జగన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు విప్లవ సంస్థలు ప్రజాప్రయోజనాల కోసం ఐక్యమవుతున్నాయని తెలిపారు. ఈ భారీ బహిరంగ సభకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రెండు మండలాల సంయుక్త కార్యదర్శి కె.భాస్కర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి పైండ్ల యాకయ్య, కట్టయ్య ఉమ్మగాని సత్యం, మల్లేష్, శంకరయ్య పాల్గొన్నారు.

కేసీఆర్ వల్లనే కృష్ణా నీటిలో అన్యాయం : కాంగ్రెస్

తొర్రూరు, ఫిబ్రవరి 12: కృష్ణా జలాల పంపకాల్లో కేసీఆర్ నిర్వాహకంతోనే తెలంగాణకు అన్యాయం జరిగిందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంచు సంతోష్, మాజీ టీపీసీసీ సభ్యుడు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. కృష్ణా జలాల పంపకాల్లో ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్న బీఆర్‌ఎస్ వైఖరికి నిరసనగా డివిజన్ కేంద్రంలోని గాంధీ సెంటర్‌లో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ మేరకు నీటి పంపకాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఇస్తే బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఉమ్మడి రాష్ట్రంలో కంటే ఎక్కువగా అన్యాయం చేసిందన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్యానాయక్, పట్టణ అధ్యక్షుడు సోమరాజశేఖర్, కౌన్సిలర్లు బూసాని రాము, తూనం రోజ, గజానంద్, నాయకులు పెదగాని సోమయ్య, రవినాయక్, గాండ్ల సంజీవ, అచ్చిరెడ్డి, మహేష్‌యాదవ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు

తొర్రూరు, ఫిబ్రవరి 12 : పట్టణ కేంద్రంలోని మార్కండేయ జన్మదినం సందర్భంగా ఆలయంలో పద్మశాలి సంఘం నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పద్మశాలి కుల ఆరాధ్యదైవం శ్రీభక్త మార్కండేయుడని ఆయన జన్మదినాన్ని ఎనగందుల సోమనర్సయ్య అయ్యగారిఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించినట్లు మందిర అధ్యక్షులు చిట్యాల శంకర్, రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాజు, చందా రవి, రవీందర్, పులేందర్, వెంకటేశ్వర్లు, కూరపాటి సోమయ్య యాకన్న, పెండెం ఉప్పలయ్య, వేముల సోమదాసు, భారీ సంఖ్యలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించాలి

▸ మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12 : ముదిరాజ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో పండ్లు విక్రయిస్తున్న ముదిరాజ్ మహిళలతో సోమవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అధికజనాభా ఉన్న ముదిరాజ్‌లకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విద్యాభ్యాసంలో ముదిరాజ్‌లు రిజర్వేషన్లు లేక వెనుకబడుతున్నారని, వారికి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలన్నారు. పండ్ల వ్యాపారం చేసుకునే ముదిరాజ్‌లకు లేబర్ కార్డు, ముదిరాజ్ మత్స్యశాఖ సొసైటీలపై అవగాహన కల్పించాలన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వడానికంటే ముందే ముదిరాజ్‌లకు ఎన్నికల ముందు ఇచ్చిన రిజర్వేషన్‌లను అమలు చేయాలన్నారు. రాజు, చిరంజీవి, రమణ, వెంకటేశ్వర్లు, శ్రీను, అశోక్, కృష్ణ, మహేష్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

ఏటూరునాగారం ఐటీడీఏ పీవో బదిలీ

▸ నూతన పీవోగా చిత్రామిశ్రా

ములుగు, ఫిబ్రవరి 12 : ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్ బదిలీ అయ్యారు. నిజామాబాద్ అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో నిజామాబాద్ అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న చిత్రామిశ్రాను నియమించింది. వీరిద్దరూ 2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. 2022 జూన్ 13న ఏటూరునాగారం ఐటీడీఏ పీవోగా బాధ్యతలు స్వీకరించిన అంకిత్ సమర్థవంత అధికారిగా మన్ననలు పొందారు. గోదావరి వరదల సమయంలో సహాయక చర్యలను చేపట్టడంలో కృషి చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ములుగు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. మేడారం మహాజాతర కోసం ఐటీడీఏ ద్వారా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. జాతర ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తూ చాలా వరకు పనులను ఇప్పటికే పూర్తిచేయించారు.

గార్ల ఎంపీపీగా బట్టు నాగరాజు ఎన్నిక

గార్ల, ఫిబ్రవరి 12 : గార్ల మండల పరిషత్ అధ్యక్షుడిగా శేరిపురం ఎంపీటీసీ బట్టు నాగరాజు ఎన్నికయ్యారు. ప్రస్తుత ఎంపీపీ మూడ్ శివాజీ చౌహాన్ నాయక్‌పై 8మంది ఎంపీటీసీలు గత డిసెంబరు 21న మహబూబాబాద్ ఆర్డీవో అలివేలుకు అవిశ్వాస తీర్మానం నోటీసును అందజేశారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందని గ్రహించిన ఎంపీపీ డిసెంబరు 23న పదవికి రాజీనామా చేశారు. ఆమోదం పొందడతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కలెక్టర్ ఈ నెల 12న ఎంపీపీ ఎన్నిక నిర్వహించాలని ఆర్డీవో అలివేలుకు ఆదేశాలు జారీ చేయగా ఎంపీటీసీలకు నోటీసులు అందించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసిన సమావేశంలో 8మంది వ్యతిరేకవర్గ ఎంపీటీసులు, ఒకరు బీఆర్‌ఎస్ ఎంపీటీసీ, శీలంశెట్టి రమేష్, కోఆప్షన్ ఎండీ ఖదీర్‌బాబా సమావేశానికి హాజరై ఓటింగ్‌ను బహిష్కరించారు. దీంతో 8మంది ఎంపీటీసీలు ఉండగా వైస్ ఎంపీపీ కట్టెబోయిన శ్రీనివాస్ బుట్టు నాగరాజును ఎంపీపీగా ప్రతిపాదించగా ముల్కనూరు ఎంపీటీసీ మాలోత్ వెంకట్‌లాల్ బలపర్చడంతో నాగరాజు ఎంపీపీగా ఎన్నికయ్యారు. నాగరాజు ఎంపిక కావడంతో కాంగ్రెస్ కార్యకర్తలు బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

ఎస్టీ స్థానాలను ఆదివాసీలకు కేటాయించాలి

కొత్తగూడ, ఫిబ్రవరి 12 : ఎంపీ ఎన్నికల్లో ఎస్టీ రిజర్వేషన్ స్థానాలైన మహబూబాబాద్, ఆదిలాబాద్‌ను ఆదివాసీలకు కేటాయించాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ దాట్ల నాగేశ్వరరావు, ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్ డిమాండ్ చేశారు. కొత్తగూడలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ 15 సంవత్సరాల నుంచి మహబూబాబాద్ ఎంపీ స్థానాన్ని లంబాడాలకు కేటాయిస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీలకు దక్కాల్సిన స్థానాలను లంబాడాలకు కేటాయించడం తమను అవమానించడమేనని అన్నారు. ఎంపీ స్థానం పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆదివాసీలకు 5లక్షల 74వేల ఓట్లు ఉన్నాయన్నారు. మహబూబాబాద్, ఆదిలాబాద్‌లను ఆదివాసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ఆదివాసీనే నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తుడుందెబ్బ వ్యవస్థాపక సభ్యుడు కల్తి వీరాస్వామి, తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి వడిగె నాగేశ్వరరావు, ఏఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు దనసరి సుధాకర్, జిల్లా అధ్యక్షుడు బొల్లి సారయ్య, నాయకులు ఎట్టి మధు, బొజ్జ సురేష్, తాటి సునిల్ పాల్గొన్నారు.

జంగిలిగొండ క్రాస్‌రోడ్ వద్ద ఆస్పత్రిని నిర్మించాలి

▸ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు సురుగు ఐలయ్య

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 12 : మహబూబాబాద్, కురవి, చిన్నగూడూరు మండలాల సరిహద్దు జంగిలిగొండ క్రాస్‌రోడ్ వద్ద 30 పడకల ఆస్పత్రిని నిర్మించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు సురుగు ఐలయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోకు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ.. మూడు మండలాల సరిహద్దులో ఆస్పత్రిని ఏర్పాటు చేస్తే పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని చెప్పారు. జంగిలిగొండ క్రాస్‌రోడ్ వద్ద ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటు కోసం ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటమల్లు, సురుగు శ్రీకాంత్, సురుగు ఎల్లయ్య పాల్గొన్నారు.

జీపీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్త రవి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. జీపీల్లో పని చేస్తున్న ప్రతి కార్మికుడికి నెలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పెరిగిన జనాభా కనుగుణంగా సిబ్బంది సంఖ్యను పెంచాలని కోరారు. కార్యక్రమంలో సూర్యం, మల్లేష్, భాస్కర్‌రెడ్డి, యాకయ్య పాల్గొన్నారు.